క్లుప్తంగా

జెడ్పీ హైస్కూల్లో సరస్వతి పూజ



ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్లో పూజలు

ముత్తుకూరు: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పాఠశాలల్లో చదువుల తల్లి సరస్వతీదేవికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని సరస్వతీదేవి విగ్రహానికి గురువారం ప్రత్యేకాలంకరణ చేసి పూజ చేశారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక నేత ఈదూరు రామ్మోహన్‌రెడ్డి పరీక్షలు రాసేవారికి అట్టలు, పెన్నులు బహూకరించారు.

మహిళలకు ఆటల పోటీలు



క్యారమ్స్ ఆడుతూ..

మనుబోలు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మనుబోలు సీఎం నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలికలు బాగా చదువుకోవాలన్నారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సుగుణమ్మ, విజయమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్సై హనీఫ్

పొదలకూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి, ఎస్సై ఎస్‌కే హనీఫ్ విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ స్టేషన్ నిర్వహణ, నేరాల నియంత్రణ, వేధింపులకు గురయ్యే మహిళలకు ఉన్న చట్టాలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో నాగార్జున స్కూల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా బాబా మందిర వార్షికోత్సవం



బాబా మందిరంలో ప్రత్యేక పూజలు

పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిర 19వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో సేవా సమితి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు చీమకుర్తి రాజగోపాల్, దామోదరరావు, ఉపకార్యదర్శి తరుగు ప్రభాకర్, సభ్యులు కె.కోటేశ్వరరావు, సుబ్బానాయుడు, లక్కాకుల ఆనందరావు, సున్నా రమేష్, కదిరి పెంచలప్రసాద్, భాస్కర్ నాయుడు, తుమ్మల శ్రీనివాసులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

- షిర్డీ సాయి సేవా సమితి సొసైటీ పర్యవేక్షణలో గ్రామోత్సవం వేడుకగా జరిగింది. బాబా భక్తులు సంకీర్తనలను ఆలపించారు.
- **మనుబోలు:** మండలంలోని మనుబోలు, జట్ల కొండూరు గ్రామాల్లో ఉన్న సాయిబాబా మందిరాల్లో గురువారం అర్చకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనుబోలులో మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. ఉభయ కర్తలుగా మడమనూరు గ్రామానికి చెందిన ఉడతా విజయ్‌కుమార్, వరలక్ష్మి దంపతులు వ్యవహరించారు.

మెట్ట రైతుల ఆశలు ఆవిరి

- సాగని డేగపూడి–బండేపల్లి లింక్ కెనాల్
- గత ప్రభుత్వ హయాంలో రైతులకు రూ.10 కోట్ల పరిహారం
- కూటమి ప్రభుత్వంలో పనుల నిలిపివేత

మండల పరిధిలోని మెట్ట ప్రాంతాల రైతులకు ఏడాదంతా సాగునీటి కల సాకారమయ్యేలా కనబడడం లేదు. ఏళ్ల తరబడి ఊరిస్తున్న డేగపూడి–బండేపల్లి లింక్ కెనాల్ పనులను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ కెనాల్‌కు ఉన్న అడ్డంకులను తొలగిస్తూ దాదాపు రైతులకు పరిహారం అందించారు. ప్రస్తుతం పనులను పూర్తి చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నా కూటమి నేతలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.



గత ప్రభుత్వంలో ముమ్మరంగా జరిగిన పనులు (ఫైల్)



లింక్ కెనాల్ కోసం సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

మనుబోలు: మండలంలోని గొట్లపాళెం, వడ్లపూడి, రాజోలుపాడు, వీరంపల్లి, లింగారెడ్డిపల్లి, మడ, అక్కంపేట, కొండుపాళెం, మడమనూరు, పర్లపాడు, కుడితిపల్లి, బండెపల్లి, జట్లకొండూరు, కొమ్మలపూడి, కాగితాలపూరు తదితర గ్రామాల పరిధిలోని 15 చెరువులకు బండేపల్లి బ్రాంచ్ కెనాల్, పాట్బేళ్ల కాలువల ద్వారా సాగునీరు సరఫరా అవుతుంది. బ్రాంచ్ కెనాల్‌కు సంగం బ్యారేజీ నుంచి కనుపూరు కాలువ ద్వారా సాగునీరు వస్తోంది. కనుపూరు కాలువ ద్వారా వచ్చే నీరు అన్ని గ్రామాలకు సరిపోకపోవడంతో మెట్ట గ్రామాల్లో పంటలు ఓ ఏడాది పండితే మరో ఏడాది ఎండబెట్టుకునే పరిస్థితి ఉంది. దీనిని అధిగమించేందుకు పొదలకూరు మండలంలోని డేగపూడి నుంచి కండలేరు నీటిని మనుబోలు మండలంలోని బండేపల్లి బ్రాంచ్ కెనాల్‌లో కలిపేలా లింక్ కెనాల్‌ను తవ్వాలని ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు ముమ్మరం

పదేళ్ల క్రితమే లింక్ కెనాల్‌కు అంకురార్పణ జరిగింది. అయితే కెనాల్ పనులు రెండు అడుగులు ముందుకు మూడు అడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి లింక్ కెనాల్ పనులకు ఉన్న సాంకేతికపరమైన అడ్డంకులను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ పనులను ముమ్మరం చేశారు. కాలువ నిర్మాణంలో పట్టా భూములు కోల్పోయిన రైతులకు చాలా వరకూ గత ప్రభుత్వ హయాంలోనే పరిహారం అందజేశారు. ఇలా దాదాపు కేనాల్ పరిధిలో రూ.10 కోట్ల వరకు పరిహారం అందేలా చేశారు. డీకేటీ, అసైన్‌మెంట్ భూములకు సంబంధించిన పరిహారం మాత్రమే పెండింగ్‌లో ఉంది.

పొదలకూరు పరిధిలో పనులు చేయాలి

ప్రస్తుతం లింక్ కెనాల్‌కు సంబంధించిన పనులు మనుబోలు, సైదాపురం మండలాల్లో దాదాపుగా పూర్తి కాగా పొదలకూరు మండలంలో మిగిలి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంత వరకూ కెనాల్ పనులు మొదలవలేదు. ఈ కెనాల్ పూర్తయితే మనుబోలు మండలం బండేపల్లి బ్రాంచ్ కెనాల్, పాట్బేళ్ల కాలువ పరిధిలోని సుమారు 15 వేల ఎకరాల మెట్ట భూములకు సమృద్ధిగా సాగునీరు అందుతుంది.



మనుబోలు మండలంలోని బండేపల్లి బ్రాంచ్ కాలువ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే పరిహారం



లింక్ కెనాల్ కోసం చేసిన భూ సేకరణలో నాది ఒకటిన్నర ఎకరా పోయింది. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే భూసేకరణ చేసినా పరిహారం మాత్రం చెల్లించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.12.50 లక్షల పరిహారం ఇచ్చారు. మనుబోలు మండలంలో పట్టా భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం అందింది.

– బత్తల వెంకటేశ్వర్లురెడ్డి, రైతు, గొట్లపాళెం

చర్యలు తీసుకోవాలి



డేగపూడి–బండేపల్లి లింక్ కెనాల్ ఈ ప్రాంత రైతులకు ఎన్నో ఏళ్ల కల. ఇది పూర్తయితే మెట్ట గ్రామాలకు సాగునీటి కొరత ఉండదు. గత ప్రభుత్వ హయాంలో పనులు జరుగుతుండేవి. కూటమి ప్రభుత్వ ఏర్పడి ఎనిమిది నెలలు దాటినా ఇంత వరకూ పనులు మొదలు కాలేదు. వెంటనే పనులు మొదలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– శ్రీహరిరెడ్డి, రైతు, అక్కంపేట

పనులు ఆగిపోయాయి



ప్రస్తుతం లింక్ కెనాల్ పనులను కాంట్రాక్టర్ ఆపేసి ఉన్నారు. ఎప్పుడు మొదలు అవుతాయో తెలియని పరిస్థితి. కాలువ నిర్మాణంలో భాగంగా సేకరించిన 95 ఎకరాలకు ఇప్పటికే పరిహారం చెల్లించాం. అసైన్‌మెంట్, డీకేటీ భూములకు సంబంధించి పరిహారం కొంత పెండింగ్‌లో ఉంది.

– అనిల్‌కుమార్‌రెడ్డి, ఈఈ, ఇరిగేషన్ శాఖ

సంపద కేంద్రాలతో పంచాయతీల అభివృద్ధి

- జెడ్పీ సీఈఓ విద్యారమ



సూచనలిస్తున్న సీఈఓ విద్యారమ

కొడవలూరు: చెత్తను సంపదగా మార్చడం ద్వారా పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ విద్యారమ సూచించారు. కొడవలూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం ఇక్కడ జరుగుతున్న బుచ్చి పంచాయతీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. చెత్తను శుద్ధి చేసి సంపదగా మార్చడం వల్ల పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరుగా మారుతుందన్నారు. ప్రతి సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలని సూచించారు. ఆమె వెంట కొడవలూరు, బుచ్చి ఎంపీడీఓలు ఎ.వెంకట సుబ్బారావు, శ్రీహరి, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, శిక్షణాధికారి శ్రీనివాసులు, కొడవలూరు పంచాయతీ కార్యదర్శి కె.మురళి ఉన్నారు.

బీఈడీ పరీక్షల్లో విద్యార్థి డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన బీఈడీ మొదటి సంవత్సరం పరీక్షలకు 1,242 మంది విద్యార్థులకు గానూ 1,137 మంది హాజరయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. నెల్లూరు నగరంలోని జగన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఒకరిని డిబార్ చేశారన్నారు.

532 మంది విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 532 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. ఉదయం నిర్వహించిన ఆరో సెమిస్టర్ పరీక్షలకు 75 మందికి గానూ 57 మంది హాజరయ్యారు. 18 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 8,805 మందికి గానూ 8,291 మంది హాజరయ్యారు. 514 మంది గైర్హాజరయ్యారు.

నిమ్మ మార్కెట్ వద్ద బారులు తీరిన ఆటోలు

పొదలకూరు: స్థానిక నిమ్మ మార్కెట్ యార్డుకు వాహనాలు పోటెత్తాయి. ధరలు రూ.2 వేలు పెరగడంతో నిమ్మ కాయలు తోలేందుకు ఆటోలు బారులు తీరాయి. మంగళవారం బస్తా కాయలు రూ.9 వేల వరకు పలకడం.. బుధవారం యార్డుకు సెలవు కావడంతో పెరిగిన ధరలు నిలకడగా ఉంటాయని తోటల్లో కాయలను ఇష్టానుసారం కోసి విపరీతంగా యార్డుకు తోలారు. అయితే ఒక్కసారిగా ధరలు రూ.2 వేల వరకు పతనమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా నిమ్మకాయల దిగుబడి బాగా పెరగడంతో మార్కెట్లకు పెద్దఎత్తున రావడం వల్లే ధరలు తగ్గినట్టుగా వ్యాపారులు వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్లో బస్తా (లూజు) ఒకటి రూ.4,800 నుంచి రూ.7 వేల వరకు ఉంది. కిలోల వంతున చూస్తే రూ.60 నుంచి రూ.88 వరకు ధరలున్నట్టు వ్యాపారులు తెలిపారు. ఇప్పుడు ధరలు కూడా బాగున్నా ఒక్కసారిగా రూ.2 వేలు పెరిగి తిరిగి అదే మొత్తం తగ్గడంతో రైతులు డీలా పడ్డారు. ధరలను ఊహించుకుని తోటల నుంచి కాయలను అధికంగా తోలడంతో యార్డు వెలుపల ట్రాఫిక్ జామైంది.



మార్కెట్ వెలుపల స్తంభించిన ట్రాఫిక్

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు



విడవలూరు: గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి



బుచ్చిరెడ్డిపాళెం : గాయపడిన వ్యక్తి

విడవలూరు: స్కూల్ వ్యాన్ ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ముదివర్తి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మండలంలోని ముదివర్తి గ్రామం గాంధీ గిరిజన కాలనీ వద్ద గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా నెల్లూరు వైపుగా వెళ్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొట్టింది. దీంతో అతను తీవ్ర గాయాలపాలై రోడ్డుపై పడిపోయారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం స్కూల్ బస్సును స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. గాయపడిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 94407 96326 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై నరేష్ కోరారు.

స్కూటీ ఢీకొని..

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని జెండాదిబ్బ సెంటర్ వద్ద హైవేపై గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ మైనర్ బాలుడు స్కూటీతో సంగం వైపు వెళ్తున్న శివ అనే వ్యక్తిని వేగంగా ఢీకొట్టారు. దీంతో శివకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో హైవే అంబులెన్స్‌లో అతడిని నెల్లూరుకు తరలించారు.

కారు, బైక్ ఢీకొని..

వెంకటాచలం: కారు, మోటార్‌బైక్ ఢీకొని ముగ్గురు గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సర్వేపల్లి వైపు నుంచి వెంకటాచలం వైపు కారు వెళ్తుండగా, వెంకటాచలం వైపు నుంచి సర్వేపల్లి వైపు వెళ్తున్న బైక్ మలుపు రోడ్డు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటాచలం : ఘటనా స్థలంలో దెబ్బతిన్న కారు, మోటార్‌బైక్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేనేతలకు చేయూత

- విచారణ పేరుతో పింఛన్లు తొలగించే ఎత్తుగడ
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేతలకు నేతన్న నేస్తం పథకం పేరుతో ఏడాదికి రూ.24 వేలు అందజేసి ఆదుకున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో గురువారం కాకాణి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలు చేనేత కుటుంబాలు కలిశాయి. తమకు కూటమి ప్రభుత్వంలో ఎలాంటి ప్రయోజనం కలగడం లేదని, ఉచిత విద్యుత్ అందజేస్తామని మోసగించినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. కాకాణి మాట్లాడుతూ రకరకాల పథకాలను ఆశగా చూపి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మొండిచేయి చూపుతున్నట్టు విమర్శించారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ప్రతి హామీలను నెరవేర్చినట్టు తెలిపారు. సోమిరెడ్డి అభివృద్ధిని విస్మరించి అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తూ సంపాదనే ధ్యేయంగా రాజకీయాలు చేస్తున్నట్టు ఆరోపించారు. ఆయనపై అనేక పర్యాయాలు వచ్చిన ఆరోపణలు వాస్తవమని తేలిందని, రూ.100 కోట్ల ఇసుక దోపిడీకు పాల్పడుతున్నట్టు తెలిపారు. రైతులకు ధాన్యం ధరలు గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్నారని, 850 కిలోలకు (పుట్టి)అదనంగా మరో 200 కిలోలు ఇస్తేనే కొనుగోలు చేస్తామని మిల్లర్లు తేల్చి చెపుతున్నట్టు రైతులు వాపోతున్నారని తెలిపారు. దివ్యాంగుల పింఛన్లను తొలగించే ఎత్తుగడలో భాగంగా కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టినట్టు చెప్పారు. అర్హుల పింఛన్లను కూడా తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఆరోపించారు. తాటిపర్తి మాజీ ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్ శ్రీహరి తల్లి రంగమ్మ ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాన్ని కాకాణి పరామర్శించారు. కార్యక్రమంలో పి.లచ్చారెడ్డి, పి.పోలిరెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వెంకటశేషయ్య, కె.కృష్ణారెడ్డి, పి.చెంచుకృష్ణారెడ్డి, సంతోష్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని మరుపూరు గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వళ్లూరు గోపాల్‌రెడ్డి (బుజ్జిరెడ్డి) సతీమణి సుమతి అనారోగ్య కారణాలతో బుధవారం మృతిచెందారు. గురువారం నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలో ఆమె భౌతిక కాయాన్ని ఉంచారు. గోవర్ధన్‌రెడ్డి వెళ్లి నివాళులర్పించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

సమన్వయంతో ధాన్యం కొనుగోలు చేయాలి

కోవూరు : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ధాన్యం కొనుగోలు జరపాలని సివిల్ సప్లయ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మంజీర్ జిలానీ సమూన్ అన్నారు. మండలంలోని పాటూరు, ఇనమడుగు రైతు సేవా కేంద్రాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జేసీ కార్తీక్‌తో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో, రైతులతో ప్రత్యేకంగా మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యంలో తేమశాతం 17 ఉంటే ప్రభుత్వ మద్దతు ధర తప్పనిసరిగా వస్తుందన్నారు. రైతులకు న్యాయం జరిగేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు. అనంతరం మిల్లర్ల అసోసియేషన్ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, కోటేశ్వరరావు, మల్లికర్జున్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం వచ్చిన తర్వాత ఆరబెట్టేందుకు పుట్టికి రూ.500 వరకు అవుతోందని, ఈ నిధులు ప్రభుత్వం నుంచి తమకు అందేలా చూడాలని కోరారు. దీనిపై ఎండీ మాట్లాడుతూ చార్జీలు మిల్లర్లకు వస్తాయని, ఈ ఆరబెట్టిన కూలి డబ్బులు మాత్రం రావన్నారు. రైతులను ఇబ్బందులు చేయకుండా వచ్చిన ధాన్యాన్ని సకాలంలో అన్లోడింగ్ చేసేలా మిల్లర్లు సహకరించాలని సూచించారు. ఆయన వెంట డీసీఓ గుర్రప్ప, డీఏఓ సత్యవాణి, తహసీల్దార్ నిర్మలానందబాబా, సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ బాలకోటమ్మ, కావలి డిప్యూటీ రిజిస్ట్రార్ కె.యలమందారావు, వ్యవసాయ సహాయ సంచాలకురాలు సుజాత, మండల ఏఓ ఇందిరావతి, పడుగుపాడు సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి, కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తదితరులున్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న సివిల్ సప్లయ్స్ ఎండీ

రైతులకు అండగా ఉంటాం

నెల్లూరు(సెంట్రల్): కోవూరు నియోజకవర్గంలోని అన్నదాతలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పంటకు మద్దతు ధర విషయమై కోవూరు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులతో నెల్లూరులోని తన నివాసంలో ప్రసన్న గురువారం చర్చించారు. రైతులకు అన్యాయం జరగకుండా క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతుగా నిలవాలని సూచించారు. మండలాల నేతలు పాల్గొన్నారు.



నాయకులతో చర్చిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి